

# అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మాండ బ్రహ్మోత్సవం!
## - ఈ సంవత్సర రెండు పర్యాయములు సంబరం -

**రెప్పపాటయినా చూడవీలుకాని**
**బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం చూడరారండీ!**
**మలయప్ప రాయుని మనసు తీరా చూద్దాం**
**ఏడుకొండలపై నూరేగు వేంకటేశ్వరుని చూడరారండీ**
**రోజుకొక్క రీతిని శ్రీదేవి, భూదేవి కూడి**
**నాలుగు మాడా వీధుల నయనానంద దర్శనమిచ్చే**
**కలియుగ వైకుంఠనాథుని చూద్దాము రారండి!**
**కలతలన్నియు బాపుకుపోదాము రారండీ! – (గోటేటి)**

– ఎంతమంది భక్తజనం! ఏంవి తన్మయదనం గోవిందా! గోవిందా అని నుతించుకుంటూ వస్తారో! ఎండైన వానైన వడగండ్లు పిడుగుళ్ళు పడుతున్నా వెరువక, జడవక వస్తారో, నేత్రానందముగా దేవేరులతో కూడిన దర్శనమవుతుందని నా నమ్మకమండి! పలు వాహనాధిష్టుడై వచ్చు వేంకటేశుని దర్శించే ఈ నవ రాత్రములే నేత్రరంజిత అహో రాత్ర నేత్రపర్వములండీ!

అదిగదిగో వేంకటాచలం, వేల్పులచే కొలువబడు వేంకటేశ్వరుడు. ఆర్తులైన వారికి మెట్టినిల్లు. ముక్కోటి దేవతల మొక్కులందు నెలవైన పుట్టినిల్లు వైకుంఠం. హరిహరాదులు ఒక్కరని వేంకట ఈశుడై వెలిసాడు. సప్తగిరుల శిఖరాగ్రమున, శివుని సిగముడిలో చంద్ర బింబముగా, ఆదివరాహమూర్తి క్షేత్రపాలనలో, ఆదిశేషుని పాన్పుగా చేసుకుని, ఆనందమానందములు మాధుర్యముగ ప్రసాదించే, కోనేటి రాయునికి కోటి శతముల సమస్కృతులర్పించ రారండి!

పీడిస్తున్న 'నందన' సంవత్సర దోషమును పరిమార్చుటకేఁవో రెండు బ్రహ్మోత్సవములు జరిపింపబడ్తున్న తిరుమల కొండలకు వెడదాం. వడ్డీ కాసులవాణ్ణి, వాహన సేవలందు దర్శిద్దాం. దీనులము స్వామీ దోసిలొగ్గుతున్నాం, దోషము లెంచకుండా, దోసిళ్ళ నిండా దీవెనలు అందించు వేంకటేశా! పద్మావతీ సమేత శ్రీనివాసా పరమపురుషా! పాహిమాం పాహి పాహి.

**వేంకటేశ సమోదేవో నాస్తి నాస్తి మహీతలే!**
**నీకు సముడైన దేఁవుడు మహిలోనే లేడయా!**








# ఆదిశక్తీ, జగదాంబా! పరమేశ్వరీ పాలయమాం!

మహాశక్తి చరాచర సృష్టికి కారణభూతురాలు. ఆశ్వయుజ శుద్ధ పాఢ్యమి నుంచి దశమి వరకు జగజ్జనిని భక్తి శ్రద్ధలతో పూజించడం ఆచారం. శుభ కామనతో ఇళ్లలో ప్రారంభమైన దేవీ పూజలు, క్రమంగా సామూహిక ప్రజా చైతన్య దీపికలై పూజలుగా మారాయి. పల్లెలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్ళలో పదిమందీ కలిసి అమ్మవారికి నవరాత్రుల పూజలు నిర్వహించే సంస్కృతి సాంప్రదాయం మన దేశానిదే! అమ్మ దేవదేవిని పూజిస్తే సర్వత్రా విజయం చేకూరుతుంది. 21న విజయదశమి సందర్భంగా ప్రత్యేక వ్యాస మాలిక

శ్రీరామచంద్రమూర్తి చేత పూజలందుకొని 'వరదాయిని'గా వినుతికెక్కింది. ఆ వరదాయిని ఈ దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంలో మొదటి మూడురోజుల్లోనూ శ్రీమహాలక్ష్మిగా, తర్వాత మూడు రోజుల్లో దుర్గామాతగా. చివరి మూడు రోజుల్లో మహాసరస్వతీ దేవిగా పూజలందుకొంటున్నది. ఆమె రూపాంతరమైన లలితా దేవిని తొమ్మిది రోజులూ భక్తిప్రపత్తులతో పూజించి పగలంతా ఉపవాసం ఉండి, రాత్రి నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని మాత్రమే భుజించే ఉపాసకులు కొందరున్నారు.

**అమ్మ కటాక్షం**

'అమ్మా! నేను నేను నీ బిడ్డణ్ణి. నీ కరుణా వీక్షణాలను నామీద ప్రసరింపజేయి' అని ఎవరు నిన్ను పూజిస్తారో వాళ్లకి నీవు సకల సౌభాగ్యములను ప్రసాదిస్తావు. విష్ణు బ్రహ్మేంద్రాదుల కిరీటాలతో హారతులందుకొన్న నా పాదాలుగల సాయుజ్యాన్నిస్తున్నావు అనుగ్రహిస్తావని శంకర భగవత్పాదులు సౌందర్యలహరిలో అమ్మవారిని కీర్తించారు. ఈ భావంలోని విశిష్టత ఎంత గొప్పదో, 'భవానిత్వం' అంటే 'తల్లీ నీవు' అనీ, 'నేను నీవు అగుదును గాక' అనే అర్థం వస్తుంది. సృష్టికి మూలకారణమైన ఆ తల్లిని పూజిద్దాం. ఆమె కృపాకటాక్షాలకు ఆపత్రులం అవుదాం.

విశ్వానికి వెన్నుదన్నుగా నిలిచే శక్తిని అమ్మగా, ఆదిపరాశక్తిగా ఆరాధించడం సాంప్రదాయం. ప్రేమ, వాత్సల్యం, దయ, శాంతం లాంటి సాత్త్విక లక్షణాలు వెల్లివిరిసే సర్వమంగళకరమైన మాతృమూర్తిని భక్తిప్రపత్తులతో పూజించడం, దుష్టశక్తులపై ఆమె సాధించి విజయాల్ని ప్రస్తుతిస్తూ భారతదేశమంతటా వేడుకలు జరుపుకోవడం శతాబ్దాలుగా వస్తున్న శక్తీ సాంప్రదాయం.

దేవీ భాగవతంలో నవరాత్రుల ప్రాశస్త్యానికి సంబంధించిన గాథావళి. ఆదిపరాశక్తి అనేక రూపాలతో, నామాలతో, అవతరించి, లోక కంటకులైన రాక్షసుల్ని మట్టుపెట్టడం ప్రధానాంశం.

శుంభ, నిశుంభ, చండ, ముండ, రక్తబీజ, మహిషాసురుడు మొదలైన రాక్షసులను వరుసగా సంహరించి, విజయదశమి నాటికి విశ్వానికి విముక్తిని